## అర్జీలకు.. నాణ్యమైన పరిష్కారం

### : సిఎంఓ గ్రీవెన్స్ లను త్వరగా పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, జనవరి 20, ప్రభాతవార్త :** పీజీఆర్ఎస్ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు..అర్జీ లను నాణ్యంగా పరిష్కరిస్తున్నారా లేదా ఆయా శాఖల అధికారులు ఆడిట్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు... ఆడిట్ నిర్వహించడంలో వెనుకబడి ఉన్నారని, వంద శాతం ఆడిట్ చేయాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని ఎటు టు ప్యూ ఆప్షన్ లో అర్జీలు పెండింగ్ ఉండకూడదని, వచ్చిన అర్జీలను గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు..అదే విధంగా రీ ఓపెన్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఎంవో ఫిర్యాదుల కు సంబంధించి పెండింగ్ లో ఉండకూడదని, వేగవంతంగా దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవో లను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఇన్చార్జి డిఆర్ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు



## నారా చంద్రబాబు నాయుడు లోకేష్ కృషి,కూటమి ప్రభుత్వం రావడానికి..కారణం

**కర్నూలు హాస్పిటల్, జనవరి 20, ప్రభాతవార్తః** రాష్ట్రంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీల గెలుపు, ప్రభుత్వ ఏర్పాటుకు ప్రధాన కారణం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రెక్కల కష్టమే ప్రధాన కారణమని కర్నూలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు పి తిక్కారెడ్డి వెల్లడించారు. సోమవారం పత్తికొండ నియోజకవర్గం క్రిష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామంలో ఎమ్మెల్యే శ్యాంకుమార్ ఆద్వర్యంలో జరిగిన ముఖ్యనేతల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం అంటే వెనకబడిన ప్రాంతమని కక్ష్యలు కార్పణ్యాలతో ఉండేదని అయితే నేడు పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధికి మారుపేరుగా మారబోతుందని తెలిపారు. ఎమ్మెల్యే శా ్యంకుమార్ నారా లోకేష్‌తో ఉన్న చనువుతో నియోజకవర్గం లో సాగునీరు, సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు తెచ్చి నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చుచేయడం జరుగుతుం దన్నారు. నారా లోకేష్, నారా చంద్రబాబు నాయుడు పోరాటాల కారణంగానే నేడు రాష్టంఓ ఉమ్మడి ప్రభుత్వం టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలో ఉందని రాబోయే రోజుల్లో కూడ కూటమి ప్రభుత్వం కొనసాగుతుంద న్నారు. డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, పత్తికొండ నియోజకవర్గ నాయకులు యం సుబ్బరాయుడు, ఎల్‌వి ప్రసాద్, యస్‌కె నబీ, శ్రీరాములు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రారంభించారు.. వదిలేశారు..!

- రూ. 40 లక్షలు నిధులు వృధా
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన గూళ్యం-I సచివాలయం
- పట్టించుకోని అధికారులు




**గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలన్న లక్ష్యంతో గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. సచివాలయ నిర్మాణం కోసం అప్పటి వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు నిదులు మంజూరు చేసింది. ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సచివాలయం భవనాలను నిర్మించినప్పటికీ సచివాలయాల్లో సిబ్బంది విధులు నిర్వహించకపోవడంతో సచివాలయాలు నిరుపయోగంగా మారాయి. వివరాల్లోకి వెళితే...**

**హాలహర్వి, జనవరి20, ప్రభాతవార్త;** మండలంలోని గూళ్యం-1 సచివాలయం రూ.40 లక్షలతో నిర్మించారు. ఎన్నికల సమయంలో అప్పటి వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి విరుపాక్షి సచివాలయాన్ని ప్రారంభించారు. అయితే సచివాలయం ప్రారంభించారు కానీ అందులో సచివాలయ సిబ్బంది మాత్రం విధులు నిర్వహించడం లేదు. గూళ్యం-1 సచివాలయం ఊరికి దూరంగా జన నివాసం లేని చోట సచివాలయం నిర్మించారని, అందుకే ఆ సచివాలయంలో సచివాలయం ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు విముఖత చూపుతు న్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం గూళ్యం-1 సచివాలయ పాత గ్రామ పంచాయతీ భవనం ఇరుకు గదిలో ఉంది. ఇరుకు గదిలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండడంతో వివిధ పనుల కోసం సచివాలయంకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.40 లక్షలు ఖర్చు చేసి సచివాలయ ఉద్యోగుల కోసం సచివాలయ భవనం నిర్మిస్తే సచివాలయ ఉద్యోగులు మాత్రం కొత్త సచివాలయంలో ఎందుకు విధులు నిర్వహించడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యం వల్లే సచివాలయ భవనం నిరుప యోగంగా మారిందని ప్రజలు విమర్శిస్తు న్నారు. పాత పంచాయతీ భవనంలో అయితే తాము ఇష్టానుసారంగా విధులకు రావొచ్చని, తమను అడిగేవారు ఉండరన్న ఉద్దేశ్యంతో కొత్త సచివాలయంకు వెళ్లకుండా ఊరికి దూరంగా ఉందన్న సాకుతో ప్రజలను, అధికారులను సచివాలయ ఉద్యోగులుమభ్య పెడుతున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. కొత్త సచివాల యంలో ఉద్యోగులు విధులు నిర్వహించకుంటే రూ.40 లక్షలతో సచివాలయం ఎందుకు నిర్మించారని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కొత్తగా నిర్మించిన గూళ్యం-1 సచివాలయం ఊరికి దగ్గరలోనే ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే సచివాలయ ఉద్యోగులు సచివాలయం ఊరికి దూరంగా ఉందని మాయమాటలు చెప్పి అధికారులను మభ్య పెడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. కొత్తగా నిర్మించిన సచివాలయంలో ఉద్యోగులు విధులు నిర్వహించకపోవడంతో సచివాలయంలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు స్పందించి సచివాలయ ఉద్యోగుల మాటలను నమ్మకుండా కొత్త సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ఈ విషయంపై మీ కోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునను వివరణ కోరగా, గూళ్యం-1 కొత్త సచివాలయం నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమేనని చెప్పారు. ఈ విషయంపై విచారణ చేసి సచివాలయ ఉద్యోగులు కొత్త సచివాలయ భవనంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## చట్ట పరిధిలో.. న్యాయం

### : ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ బిందు మాధవ్
### : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 78 ఫిర్యాదులు

**కర్నూలు, జనవరి 20, ప్రభాతవార్త :** కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జి. బిందు మాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 78 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందు మాధవ్ ఐపియస్ గారు హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐ శివశంకర్ పాల్గొన్నారు.



## ఎంఎస్ఎంఈ యూనిట్ల సర్వే పూర్తిచేయండి

### - వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి :జిల్లా కలెక్టర్




నంద్యాల, జనవరి 20, ప్రభాతవార్త ప్రతినిధిః జిల్లాలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల సంబంధించి పెండింగ్‌లో ఉన్న సర్వేను ఈనెల 31లోపు సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్‌లతో పూర్తిచేయించా లని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంపిడిఓలను అదేశించారు. జిల్లాలో ఇంకా 65 వేల యూనిట్ల సర్వే పెండింగ్‌లో ఉందని సచివాలయ సర్వే వేగవంతంచేసి పూర్తిచే యాలన్నారు. మండలాల వారిగా కమర్షియల్ విద్యుత్ యూనిట్లకు సంబంధించిన డేటాను పంపామని గ్రామ/వార్డు సచివాలయాల వారిగా విభ జించి సర్వేలను పూర్తిచేయాలని ఎంపీడిఓ,తహశీల్దార్‌లను కలెక్టర్ అదేశించారు.

**వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండిః** 15 నుండి 50 సంవత్సరాల లోపు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని స్వయం సహాయక బృందాల సభ్యులకు కలెక్టర్ అదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం కింద నిర్వహిస్తున్న వయోజనుల విద్యా కేంద్రాలు ఈనెల 23 నుండి ప్రారంభం అవుతాయన్నారు. ప్రతి 10 మంది నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఒక వాలంటీర్ టీచర్ ఉంటారని సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు నిర్వహించే ఈ కేంద్రాలను జిల్లా అధికారులు సందర్శించి ప్రోత్సహించాల న్నారు. మార్చి 31 లోపు 26 వేల మంది నిరక్షరాస్యులకు తెలుగులో సంతకం పెట్టడమే కాకుండా అక్షరాలను గుర్తుపట్టేవిధంగా నేర్పించాలన్నారు. మార్చి 31 తరువాత నిర్వహించే ఓపెన్ స్కూల్ పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యేలా శిక్షణ ఇవ్వాలన్నారు.

## కర్నూలు జిల్లా ఎస్పీగా.. విక్రాంత పాటిల్..

### : బిందు మాధవ్ కాకినాడకు బదిలీ



**కర్నూలు, జనవరి 20, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా కొత్త ఎస్పీగా విక్రాంత్ పాటిల్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో 27 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు కాకినాడ ఎస్పీగా పనిచేస్తున్న విక్రాంత్ పాటిల్ ను కర్నూలుకు బదిలీ చేశారు. కర్నూల్లో ఎస్పీగా పనిచేస్తున్న బిందు మాధవ్ ను కాకినాడకు బదిలీ చేశారు. త్వరలో కొత్త ఎస్పీ బాధ్యతలు తీసుకోనున్నారు

## బాల్యవివాహాల నిషేధిత చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయండి : జిల్లా కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల, జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** బాల్యవివాహాల నిరోధానికి గ్రామ, మండల స్థాయిలో బాల్యవివాహాల నిషేధిత పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటై ప్రజల్లో బాల్యవివాహాల నిరోధంపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా బాల్యవివాహాల నిరోధక చట్ట అమలుపై క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధక చట్టం లోని ప్రభుత్వ జీఓ లోని 31, 39 లో ఉన్న అంశాలను క్షుణ్ణంగా చదివి బాల్యవివాహాల నిరోధకానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామం, మండల స్థాయిలో బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేసుకోవాల్సిన చర్యలపై వివరించాలన్నారు. ఇందుకోసం ఆర్డీవోలు, ఎంపీడీవోలు సమావేశాలు నిర్వహించి గ్రామ మండల స్థాయి కమిటీలు చురుకుగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్యవివాహాల నిషేధిత చట్టాన్ని అతిక్రమిస్తే రెండు సంవత్సరాల జైలు శిక్షతోపాటు లక్ష రూపాయలు జరిమానా విధించే అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకురావాలన్నారు. జిల్లాలో ఇంత పెద్ద ప్రభుత్వ యంత్రాంగం వుండి 58 బాల్య వివాహాలను ఆపలేకపోయామన్నారు. బాల్యవివాహాలు ఆపడంతోపాటు ఇరు వర్గాల తల్లిదండ్రులను కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. సచివాలయ మహిళా పోలీస్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు, స్వయం సంఘ బృందాలు, పాఠశాలలు, కళాశాలలు సిబ్బంది చురుకుగా పనిచేసి బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాల కోసం కాళ్లు అరిగేలా తిరగకుండా సంబంధిత ఇళ్లకు వెళ్లి నిర్ణీత గడువులోగా ఇచ్చే సంప్రదాయానికి శ్రీకారం చుట్టాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులు బాధ్యత తీసుకొని బాల్యవివాహాలను సమూలంగా అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాల్యవివాహాల కేసులను రిజిస్టర్ చేసి పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి శిక్ష అమలుపరిస్తే ప్రజల్లో అవగాహన వస్తుందన్నారు. బాల్యవివాహాల నిరోధిక చట్టానికి పోలీస్ యంత్రాంగం నుండి పూర్తి సహకారం అందిస్తామని అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు కలెక్టర్ కు వివరించారు. గ్రామస్థాయిలో ఈ చట్టంపై పూర్తి అవగాహన తీసుకొస్తే బాల్యవివాహాలు నియంత్రణ వ్యవస్థకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు.




## బనగానపల్లెలో పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత





**బనగానపల్లె, జనవరి20, ప్రభాతవార్త:** బనగానపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. సోమవారం బనగానపల్లెలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్య అనుచరుడు అబ్దుల్ ఫైజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అలాగే పెద్దఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఇటీవలే ఫైజ్ కుమారుడి వివాహంలో డ్రోన్ కెమెరా ఎగురవేశారన్న ఉద్దేశ్యంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం విధితమే. పోలీస్‌స్టేషన్ వద్ద భయానక వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఇంటి సమీపంలో వీఐపీ జోన్ ఉంది కాబట్టి అబ్దుల్ ఫైజ్ కుమారుడు అబ్దుల్ ఉబేద్ వివాహ వేడుకల్లో డ్రోన్ కెమెరా మంత్రి జనార్ధన్‌రెడ్డి ఇంటి సమీపంలో తిరగడంతో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మొత్తం 3 సెక్షన్ల కింద నలుగురి పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే మంత్రి అనుచరులను కులం పేరుతో దూషించి హత్యయత్నానికి పాల్పడడం పై ఎస్సీ, ఎస్టీ 307 సెక్షన్ల కింద కేసు నమోదుచేసి అబ్దుల్ ఫైజ్‌ను అరెస్ట్ చేశామని మరో ముగ్గురిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీఎస్పీ విలేకరుల సమావేశంలో తెలిపారు. వైసీపీ నాయకుడు ఇచ్చిన ఫిర్యాదు పై దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలియజేశారు.

## మృత్యుకుంట..!

- ఆ నీటికుంట..తల్లిదండ్రులకు కలిగించిన కడుపు మంట..
- నీటికుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి..
- ఒకే కుటుంబానికి చెందిన అక్క తమ్ముడు..
- జంపాపురం గ్రామంలో నెలకున్న విషాదఛాయలు..



**అక్కడ ఉన్న నీటి కుంట వారి పాలిట మృత్యుకుంటగా మారింది..ఆడుకునే వయసు, బంగారు భవిష్యత్తు ఉన్న ఆ చిన్నారులను ఆ కుంటబలి తీసుకుంది..మృత్యుకుంట ఆ చిన్నారి తల్లిదండ్రులకు కడుపు మంట కలిగించింది..సంక్రాంతి సెలవులు అయిపోయాయి.. మొదటి రోజుబడి ఉండదని రేపు వెళ్లవచ్చని అనుకుని ఆ చిన్నారులు తమకు ఉన్న మేకలను, గేదెలను మేపడానికి వెళ్లి నీటికుంటలో పడి మృతి చెందినసంఘటన సోమవారం సాయంత్రం కోసిగి మండల పరిదిలోని జంపాపురం గ్రామంలో చోటు చేసుకుంది.. వివరాల్లోకి వెళ్లితే..**



**జంపాపురం(కోసిగి), జనవరి 20, ప్రభాతవార్త** కోసిగి మండలంలోని జంపాపురం గ్రామానికి చెందిన కురువ పెద్దనం సింహులు, పద్మవతిలకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు.. వీరిలో పెద్ద కుమార్తె నరసమ్మ(12) ఎమ్మిగనూరు గురుకుల పాఠశాలలో చదువు తుండగా రెండో కుమారుడు దేవేంద్ర మౌంట్ కార్మెల్ పాఠశాల ల్లో 8వ తరగతి చదువుతుండగా మూడో కుమారుడు రఘువరన్(10) అదే జంపాపురం గ్రామంలోని బసవేశ్వర పాఠశాలలో 5వ తరగతిచదువుతు న్నాడు.. వీరందరు సంక్రాంతి సెలవులకు గ్రామానికి వచ్చారు.. సోమవారం సెలవులు అయిపో యాయి.. మంగళవారం వెళ్లవచ్చనే ఇంట్లోనే ఉన్నారు..కాగా వారు నివాసం చేస్తున్న గుడిసెను మరమ్మత్తులు చేపట్టుతుండగా పెద్దవారు ఇంటివద్ద పనులు చేసుకుంటు గామిగతా ముగ్గురు పిల్లలు తమకు ఉన్న మేకలు గేదెలను మేపడానికి సమీపంలో ఉండే పొలాలకు వెళ్లారు..తీర మధ్యాహ్నం దాటిన తరువాత గేదెలు నీటికుంటలోకి దిగి నీరు తాగు తుండగా అక్కడ ఉన్న బురదలో నుండి గేదె బయటకు రాలేక పోయింది..దీంతో దీనినిగమ నించిన నరసమ్మ నీటికుంటలోకి దిగి గేదెను లాగే నేపథ్యంలో బాలిక కుంట బురదలో ఇరుక్కుని పోయింది. నీరు ఎక్కువ నిలువ ఉండడంతో నీటిలో మునిగింది.. దీంతో రెండో తమ్ముడు రఘువరన్ అక్కను చూసి బయటకు లాగేందు కు నీటిలోకి వెళ్లిగా కాలుజా రింది.. దీంతో ఇద్దరు నీటికుంటలో మునిగి పోయారు.. ఈ దృశ్యాన్ని చూసిన రెండో తమ్ముడు కేకలు వేయగా పక్క పొలాల్లో ఉంటున్న వారు వచ్చినీటికుంటలో వెతికారు చాలా సేపటికి ఇద్దరిని గుర్తించి వారివురిని బయటతీసారు.. అప్పటికే వారు మృతి చెంది ఉండడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటా హుటిన వచ్చి భోరున విలపిం చారు.. ఒకే కుటుం బానికి చెందిన ఇద్దరు చిన్నారులు మృతి చెందడం తో గ్రామంలో విషాదఛాయలు నెలకున్నాయి..కాగా ఈ ప్రాంతంలో గతంలో గరుసు కోసం ఎక్కువ లోతు తీయడంతో ఇది కుంటగా మారినీరు చేరి ఊబిగా తయారయి ందని, నీరు నిల్వ ఉండ డంతో ఇలా జరిగిందని పలువురు చర్చించు కుంటున్నారు.. ఈ సంఘటన తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్ గ్రామం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.. ఏది ఏమైనా ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులను బలి తీసుకున్న ఈకుంట మృత్యుకుంటగా మారిందని చెప్పవచ్చు..

## ఏ చిన్న పొరపాటు జరిగినా నేను సహించను..!

### - ఎవరైనా డబ్బులు అడిగితే 1064కు ఫోన్ చేయండి
### - ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

**ఆదోని, జనవరి 20, ప్రభాతవార్త** ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధికారులు ఏ చిన్న పొరపాటు చేసినా సహించనని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. సోమవారం సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో తమ ఆస్తులు రిజిస్ట్రేషన్ కోసం డబ్బులు అడిగితే 1064డయల్ చేయాలని లేకపోతే వారి సమస్యను నా దృష్టికి తీసుకొచ్చినా వారి సమస్యకు పరిష్కార మార్గం చూపుతామన్నారు. తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసే సమయంలో తొందరపాటు పడకుండ నిదానంగా వారి డాక్యుమెంట్లను పరిశీలించుకొని తర్వాతే రిజిస్టర్ చేసుకోవాలన్నారు. డాక్యుమెంట్ రైటర్లు కూడా వారి యొక్క పత్రాలను పరిశీలించిన తర్వాతే రిజిస్టర్ చేసేందుకు రిజిస్టర్ కార్యాలయంలోకి వెళ్లాలని ఇద్దరు సబ్ రిజిస్టర్లు మారారని ఇక్కడ అప్‌డేట్‌ను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటానని కొందరు బయట వ్యక్తులు (దళారులు) తొందరగా రిజిస్ట్రేషన్ చేస్తామని అదనంగా డబ్బులు వసూలు చేసి వెళుతున్నారని అలాంటి రిజిస్ట్రేషన్లు సరిగా ఉండవని బయట వ్యక్తులను నమ్మి మోసపోకండి అని అన్నారు. అలాగే కోర్టు తగాదాలు వివాదాస్పద భూములు ప్రభుత్వ భూములను కొనుగోలు చేయకండి అని కొనుగోలు చేసే సమయంలో ఒకటికి రెండుసార్లు చూసి కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు. రాష్ట్రంలోనే లంచం అడగని సబ్ రిజిస్టర్ కార్యాలయంగా ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని చేస్తానన్నారు. కొందరు వ్యక్తులు ఎక్కడ ఆస్తులను అక్కడే రిజిస్టర్ చేయకుండ వేరే మండలాలు మరియు వేరే జిల్లాలలో ఎందుకు చేసుకుంటారని అలాకాకుండ ఇక్కడ ఆస్తులను బయటి వారు ఎక్కడైనా రిజిస్టర్ చేసుకుంటే అలాంటి సమయంలో ఆదోని సబ్ రిజిస్టర్‌కు అందించాలని జిల్లా రిజిస్టర్ ఆఫీసుకు కూడా లెటర్ రాస్తానని ఆయన అన్నారు.



## బెలుం సిద్దరామేశ్వరస్వామి ఆలయంలో పూజలు

**కొలిమిగుండ్ల, జనవరి20, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని బెలుం గ్రామంలో వెలసిన పురాతన ప్రసిద్ద సిద్దరామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణాన్ని పవిత్ర జలాలతో శుద్ధి చేసి స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు భక్తులు సిద్దరామేశ్వరస్వామిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

## కుష్ఠు వ్యాధి చిహ్నాలు, లక్షణాల కోసం

### స్వీయ పరీక్ష నిర్వహించుకోండి



**బనగానపల్లె, జనవరి20, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బనగానపల్లె 5వ సచివాలయం పరిధిలో డాక్టర్ సిహెచ్ శివశంకరుడు గృహాలను సందర్శించి ఎల్‌సీడీసీ సర్వేను తనిఖీ చేయడం జరిగింది. అలాగే ఎల్‌సీడీసీ సర్వే 20-1-2025 నుండి 2-2-2025 వరకు జరుగుతుందని మరియు లెప్రసీ అనుమానిత కేసులను తప్పకుండా పీహెచ్‌సీకి రెఫర్ చేయాలని సూచించడం జరిగింది. అలాగే ఏఎన్ఎం మరియు ఆశలకు ఎల్‌సీడీసీ సర్వేకు సంబంధించిన తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఎల్‌సీడీసీ సర్వేకు ఆశా కార్యర్తలు గృహాలను సందర్శించినప్పుడు ప్రజలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివశంకరుడు, సరస్వతి, హెల్త్ ఎడ్యుకేటర్ అయ్యమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రమేష్, ఎంఎల్‌సీ గ్రేషమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాడిపరిశ్రమ అభివృద్ధి కోసమే పశుఆరోగ్య శిబిరాలు

బనగానపల్లె, జనవరి20, ప్రభాతవార్త: పశువుల సంరక్షణ కోసం రా ష్ట్ర ప్రభుత్వం పశు ఆరోగ్య శిబిరాలను తీసుకువచ్చిందని పాతపాడు గ్రామ సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పాతపాడు గ్రామంలో పశుఆరోగ్య శిబిరం మరియు లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశుసంరక్షణ కోసం గోకులాలను మరియు పశుగ్రాస క్షేత్రాలను తీసుకురావడం జరిగిందన్నారు. పశు గణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులకు లింగనిర్ధారిత వీర్యం ద్వారా కేవలం ఆడ దూడలు పుట్టే ఎద సూదులు ఎక్కువ పాల ఉత్పత్తిచేసే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. వెటర్నరీ పాలిక్లినిక్ ఉపసంచాలకులు డాక్టర్ హేమంత్ పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. అనంతరం పశువులకు మరియు దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. పాడి రైతులకు సర్పంచ్ మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా పాలటిఫిన్లు, క్యాల్షియం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు శంకేశ్వరరెడ్డి, సహాయ సంచాలకులు డాక్టర్ మారుతి సకారమ్, పశువైద్యులు రామ్‌కుమార్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, పశువైద్య సిబ్బంది ముక్తియార్, నాగేశ్వరరావు, రామకృష్ణ, కేదార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైల మల్లన్నకు సహస్ర దీపార్చనలు



**శ్రీశైలంప్రాజెక్టు, జనవరి20ప్రభాతవార్త:** శ్రీశైలక్షేత్రంలో భ్రమరాంబా, మల్లికార్జునస్వామివార్లకు సోమవారం సేవలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఉభయ దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు సహస్రదీపార్చన జరిపారు. ముందుగా ఉత్సవరులకు ప్రత్యేక అర్చనలు, హారతి పూజలు జరిపి తదుపరి వెయ్యి దీపాలు వెలిగించి దీపార్చన నిర్వహించారు. అనంతరం ఉభయదేవాలయ ప్రాంగణంలో స్వామి =అమ్మవార్లకు వెండిరధోత్సవ సేవ జరిపారు. మల్లన్నకు అత్యంత ప్రీతికరమైన రోజుగా భావించే సోమవారం స్వామిఅమ్మవార్లకు శాస్త్రబద్దంగా దీపార్చన, వెండిరథసేవలు నిర్వహించడం అనవాయితి. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకస్వాములు, వేద, ఆగమ పండింతులు పాల్గొన్నారు.

## రైతులను నట్టేట ముంచుతున్న పొగాకు కంపెనీ నిర్వాహకులు-ఏపి రైతు సంఘం



**వెల్దుర్తి, జనవరి20, ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలంలో పొగాకు కంపెనీ నిర్వాహకు రైతులను నట్టేట ముంచుతున్నారని సిపిఐ, ఏపి రైతుసంఘం మండల నాయకులు టి.క్రిష్ణ, డి.రాజు అన్నారు. ఈ విషయంపై సోమవారం వారు మండల తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మకు వినతిపత్రం అందించారు. పొగాకు కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పొగాకు సాగుచేస్తే మంచి ధర ఇస్తామని రైతులను నమ్మించి సాగు సమయంలో నిర్ణయించిన ధర కాకుండా తక్కువ ధరకే రైతుల నుంచి కొనుగోలు చేసుకొని అధిక ధరలకు విక్రయించి లక్షల్లో సంపాదించుకుంటున్నారన్నారు. వెల్దుర్తి జాతీయరహదారిలో చెరుకులపాడు క్రాస్‌రోడ్ వద్ద ఓ గోడౌన్, రామళ్లకోట రోడ్డు బ్రహ్మగుండం మలుపు వద్ద ఓ గోడౌన్‌లో రైతుల నుంచి పెద్దఎత్తున పొగాకును కొనుగోలు చేస్తున్నారన్నారు. మీ పొగాకు బాగలేదని నిర్ణయించిన ధరలకు కొర్రి పెడుతున్నారని రైతులు వాపోయారన్నారు. అదేవిధంగా ఈ వ్యాపారం చేసుకునేందుకు కనీసం గ్రామపంచాయతీ అనుమతులు సైతం తీసుకోలేదని తెలిసిందన్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు గోడౌన్‌లను తనిఖీ చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి టి.క్రిష్ణ, ఏపి రైతుసంఘం మండల అధ్యక్షులు డి.రాజు, నాయకులు చిలిపిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిరక్షరాసులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

**దేవనకొండ, జనవరి 20, ప్రభాతవార్త:** ఒక వాలంటరీ టీచర్‌కి 10మంది నిరక్ష్యరాసులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఓ గౌరిదేవి, ఏపిఎం నరసన్న, జిల్లా వయోజన విద్య సూపర్‌వైజర్ ఫయాజ్‌లు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవనకొండలో మండల మహిళా సమాఖ్య స్త్రీశక్తి భవనంలో ఉల్లాస్‌కి సంబంధించి రెండవ విడత మొదటిరోజు సోమవారం ఎంపిడిఓ గౌరిదేవి అధ్యక్షతన వాలంటరీ టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణలో ఒక వాలంటరీ టీచర్‌కి 10మంది నిరక్షరాసులను అక్షరాసులుగా చేసే పని అప్పగించడం జరిగిందన్నారు. వారు ఏ విధంగా చదువు చెప్పాలి ఈ మూడు నెలల కాలంలో వాళ్లని అక్షరాసులుగా ఎలా చేయాలి అనే దానిపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వారికి వయోజనులకు సంబంధించి బుక్స్, వారి అటెండెన్స్, వాలంటరీ టీచర్‌కు సంబంధించిన మార్గదర్శిని బుక్స్‌ను పంపిణీ చేయడం జరిగింది. నేటి నుంచి వీరు వారికి సంబంధించిన పది మందికి విద్య నేర్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన సిసిలు ప్రభాకర్, మస్తాన్, మంగన్న, స్వామన్న, అకౌంటెంట్ శివ, విఓఏలు, వివిధ గ్రామాల వాలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

## పగిడ్యాల మండలంలో భూముల రీసర్వేకు

### రెవెన్యూఅధికారులు శ్రీకారం

**పగిడ్యాల, జనవరి 20, ప్రభాతవార్త :** పగిడ్యాల మండలంలో భూముల రీసర్వేను రెవెన్యూఅధికారులు సోమవారం శ్రీకారం చుట్టారు. మండల కేంద్రమైన పగిడ్యాల కెసి ఆయకట్టు పరిధిలోని సర్వేనెంబరు 89 నుండి 99 సర్వే నంబరు వరకు పట్టాదారులు అందరు హజరయ్యారు. వాళ్లకు సంబందించిన పొలం సరిహద్దులు చూపించారు. పట్టాదారులకు సంబంధించిన డాక్యూమెంట్లను పరిశీలించారు. రీసర్వేను డిప్యూటీ తహశీల్దార్ మురళీమోహన్ పర్యేవేక్షించారు. పాట్టదారు వ్యవ్యసాయ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించి వారికి నోటీస్‌లు ఇవ్వడం జరుగుతుందనీ రీసర్వేలో పాల్గొన్న రోజులకు 20ఎకరాల చొప్పున షెడ్యూలు ప్రకారం నాలుగు మాసంలో రీసర్వేపూర్తిచేయడం జరుగుతుందనీ రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ్ సర్వేర్లు వెంకట్‌కుషుమంత్, జయలక్ష్మి, విఆర్ఓ నాగన్న, గ్రామ తలార్లు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలతోనే ఆరోగ్యం

**ఆస్పరి, జనవరి 20, ప్రభాతవార్త:** ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసిఆర్‌పి యూనిట్ ఇంచార్జ్ వీరేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఆస్పరిలో గ్రామాలలో పనిచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసిఆర్‌పిలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల అమ్మకాలు చేపట్టారు. పొలంలో వేసిన బీరకాయ, వంకాయ, ముల్లంగి, మెంతికూర, టమోటాను పండించారు. వాటిని పండించి సిఆర్‌పిలు ఆస్పరిలో రైతులకు ప్రజలకు అవగాహన కోసం అమ్మకానికి చేపట్టినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో పండించి తినడం వలన ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో నిరంతర ఆదాయం ఏటీఎం మోడల్ ద్వారా పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు నరసింహులు, లక్ష్మీకాంత్, భూలక్ష్మి, జగదాంబుడు తదితరులు పాల్గొన్నారు.

## 24న జాతీయ బాలిక దినోత్సవ వక్తృత్వ పోటీలు

**నంద్యాల టెక్కె, 20 జనవరి, ప్రభాతవార్త:** జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 24వ తేది శుక్రవారం బాలికలకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్‌రావు, నంద్యాల మిషన్ పింక్ హెల్త్ అధ్యక్షురాలు డాక్టర్ నెరవాటి అరుణకుమారి తెలిపారు. నంద్యాల ఐఎంఏ, మిషన్ పింక్ హెల్త్ విభాగం, మహిళా వైద్యుల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈపోటీలు రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో ఉదయం 10గంటలకు ప్రారంభమవుతాయన్నారు. 7,8,9,10 తరగతులలో చదివే బాలికల కోసం నిర్వహించే వక్తృత్వ పోటీల్లో తెలుగులో 'బాలికల గౌరవం' ఎదుర్కొంటున్న అసమానతలు, వాటిని ఎలా తొలగించాలి, బాలికల విద్య, వారి హక్కులు కాపాడాల్సిన ఆవశ్యకతపై అవగాహన పెంచే విధంగా ఈపోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలు తెలుగు, ఆంగ్ల భాషలలో వేర్వేరుగా ఉంటాయని, ఒక విద్యార్థిని ఒకే భాషలో వక్తృత్వ పోటీలో మాత్రమే పాల్గొనాలని, గెలుపొందిన బాలికలకు ప్రథమ, ద్వితీయ బహుమతులతోపాటు రెండు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని వారు తెలిపారు.

## నేషనల్ నర్సింగ్ స్కూల్‌పై చర్యలు ఎక్కడ..?



**ఆదోని, జనవరి 20, ప్రభాతవార్త:** నేషనల్ నర్సింగ్ స్కూల్‌పై చర్యలు ఎక్కడ అని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ షాబీర్‌భాషా అధికారులను ప్రశ్నించారు. సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా షాబీర్‌భాష మాట్లా డుతూ పట్టణంలోని నేషనల్ నర్సింగ్ స్కూల్ నందు విద్యార్థుల నుండి అక్రమంగా వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. నేషనల్ నర్సింగ్ స్కూల్‌పై గతంలో చాలాసార్లు ఫిర్యాదు చేసినా తూతూమంత్రంగా పరిశీలన చేసి ఏ చర్యలు తీసుకోకపోవడం లేదని మండిపడ్డారు. తక్షణమే స్కూల్ గుర్తింపు రద్దు చేసి ఆ కళాశాల యాజమాన్యం చేస్తున్న అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స ్పందించిన కలెక్టర్ తక్షణమే విచారణ కమిటీ వేసి ఒక వారంలోపు కచ్చితంగా ఆ కళాశాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పట్టణ కోశాధికారి శేఖర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్, నాయకులు వీరేష్, శివ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం

**హొలహర్వి, జనవరి20, ప్రభాతవార్త;** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నెట్టికంటమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశంలో మండలంలోని వివిధ సమస్యలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. తాగునీరు, విద్య, వైద్యం తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశానికి ఆయా గ్రామాల ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాలన్నారు.

## నందిపాడులో పశువైద్యశిబిరం

**కొలిమిగుండ్ల, జనవరి20, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని నందిపాడు గ్రామంలో సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు కొలిమిగుండ్ల పశువైద్యశాల డాక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ పశువైద్య శిబిరంలో పాడి పశువులతోపాటు గొర్రెలు, మేకల కాపరులకు సంబంధించిన మందలను పరిశీలించి చికిత్సలు నిర్వహించారు. అవసరమైన గొర్రెలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాడి రైతులు, గొర్రెల కాపరులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా రమేష్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో నందిపాడు బాలయ్య, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగితే సహించేది లేదు

**- ఎంపీడీఓ వరలక్ష్మి**



**హొలహర్వి, జనవరి20, ప్రభాతవార్త;** ఉపాధి హామీ పనుల్లో అవినీతి అక్రమాలు జరిగితే సహించేది లేదని ఎంపీడీఓ వరలక్ష్మి ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా వలసల నివారణ కోసం ప్రభుత్వం ఉపాధి హామీ పనులను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కావునా ఫీల్డ్ అసిస్టెంట్లు జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి పని కల్పించి వలసలు నివారించాలని ఆదేశించారు. మండలంలో 7300 జాబ్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం మండలంలోని 1160 మంది పనులకు వస్తారని ఆమె తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పనికి రాని వారి పేర్లు హాజరు వేసుకొని అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. అక్రమాలకు పాల్పడే ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ చేసి విధుల నుంచి తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చక్రపాణి, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

**- తహసీల్దార్ నజ్మాభాను**

**హొలహర్వి, జనవరి20, ప్రభాతవార్త;** భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ రీ సర్వే ప్రవేశపెట్టిందని తహసీల్దార్ నజ్మాభాను, మండల సర్వేయర్ శ్రావణభార్గవి అన్నారు. సోమవారం మండలంలోని పచ్చారపల్లి గ్రామంలో భూ రీ సర్వే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ రీ సర్వే చేయడం వల్ల భూ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. అంతేగాకుండా దీర్ఘకాలిక భూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలకు పరిష్కారమార్గం దొరుకుతుందని వారు తెలిపారు. అలా భూ రీ సర్వే వల్ల భూమి సరిహద్దులు ఆన్‌లైన్ సమస్యల పరిష్కారమవుతాయని చెప్పారు. ఇందులో భాగంగా ప్రభుత్వ భూములు గుర్తించడం జరుగుతుందన్నారు. రైతులు రీ సర్వేకు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ప్రహ్లద్‌రెడ్డి, వీఆర్వోలు లింగప్ప, రాఘవేంద్రస్వామి, ఈరప్ప, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## పరమశివుడికి శివస్వాముల ప్రత్యేక పూజలు

- **రామలింగేశ్వరుడికి పంచామృతాభిషేకం**
- **అభిషేకంలో పాల్గొన్న శివస్వాములు**



**గడివేముల, జనవరి20, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన గడివేములలోని శివాలయంలో కొలువై ఉన్న రామలింగేశ్వరస్వామికి అర్చకులు బ్రహ్మయ్యశర్మ ఆధ్వర్యంలో సోమవారంనాడు శివస్వాములు విశేష పూజలు నిర్వహించారు. మండల మాలాధారణ స్వీకరించిన తర్వాత మొదటి సోమవారం కావడంతో శివాలయంలోని రామలింగేశ్వ రస్వామికి వేకువజామున అర్చకులు బ్రమ్మయ్యశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పంచా మృతాలతో అభిషేకం నిర్వహించారు. శివార్చన, శివ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ బిల్వార్చన, విశేష పుష్పాలతో అలంకరణ చేసి బిల్వాష్టకం, లింగాష్టకం, శివ పంచాక్షరి స్తోత్రం, శివనామ స్తోత్రం పఠించారు. ఈ కార్యక్రమంలో మండల దీక్ష తీసుకున్న శివమాలధారణ స్వాములు పాల్గొన్నారు.

## టీబీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఆదోనిలీగల్, జనవరి20, ప్రభాతవార్త;** ఆదోని పట్టణంలోని హనుమాన్‌నగర్, అరుంధతినగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో టీబీ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించినట్లు వైద్యులు షేకున్‌భాను, రేణుశ్రీ, అనిల్‌సాగర్, వినోద్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో టీబీ యూనిట్‌లో గల్ల పరీక్ష, ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలియజేశారు. వ్యాధి నిర్ధారణ తర్వాత వ్యాధిగ్రస్తునికి ఉచితంగా మందులు ఆరు నెలలు ఇస్తారని, వారికి ప్రతినెలా రూ.500 ఆరు నెలలపాటు ఇస్తారన్నారు. వారికి కావాల్సిన పోషకాహారం గురించి, వ్యక్తిగత శుభ్రత గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. దగ్గు వచ్చినప్పుడు చేయి అడ్డుపెట్టుకోవాలన్నారు. కుటుంబ సభ్యులకు ఈ వ్యాధి రాకుండా వారు కూడా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన

**కర్నూలు హాస్పిటల్, జనవరి 20, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా కల్లూరు మండలం తాండ్రపాడులోని క్రేడోస్కూల్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవకార్యక్రమాలు డి ప్యూటి ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శాంతకుమారి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. క్రేడో స్కూల్‌లో రోడ్డు భద్రత కార్యక్రమం నిర్వ హించారు. ఈకార్యక్రమంలో ఈఐబి డ్రైవర్లు అండ్ అటెండర్లు పాఠశాల సిబ్బంది హాజరయ్యారు. పిల్లల బస్సు భద్రత, డ్రైవర్ల క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలపై సూచనలు ఇచ్చారు. విద్యార్థులను ఇంటి నుండి పాఠశాలకు పాఠశాల నుండి నివాసానికి తీసుకెళ్లడానికి భద్రత గూర్చి సూచనలు తెలిపారు. ఈసందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు ఎస్ నాగరాజ నాయక్, ఎంవి సుధాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులు, ప్రజలు, విద్యారు ్థలను భాగస్వామ్యం చేసి రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు బాబు కిశోర్, ఎన్ గణేష్‌బాబు, ట్రాన్స్‌పోర్టు హెడ్‌కానిస్టేబుల్ చలపతి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం మండలంలో కులగుణన గడువు పెంచాలి:ఎంఆర్‌పిఎస్

**శ్రీశైలంప్రాజెక్టు, జనవరి, ప్రభాతవార్త:** శ్రీశైలం మండలంలో చేపట్టిన కులగుణన గడువును పెంచాలని శ్రీశైలం మండలం ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు నాగెళ్ల సురేష్ ఆధ్వర్యంలో సోమవారంనాడు తహశీల్దార్ శ్రీనివాసరావును కలసి వినతిపత్రంను అందజేసారు. గడువును పెంచి తప్పులను సవరించుకునేందుకు మరోక అవకాశం కల్పించాలని పేర్కన్నారు. నిరాక్షరాసులు చాల వరకు అవగాహన లేక తప్పులు సవరించుకోలేదని చెప్పారు. కాగా మరోమారు ప్రత్యేకమైన అవకాశం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస నాయకులు యం.దేవిడ్, సురేస్, దేవిడ్, ప్రసాద్ తదితరులు పోల్గోన్నారు.

## హలిగేరలో రీసర్వే పనులు ప్రారంభం

**ఆస్పరి, జనవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హాలిగేర గ్రామంలో రీసర్వే పనులు ప్రారంభించినట్లు తహశీల్దార్ శివశంకర్‌నాయక్, పత్తికొండ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే అధికారి భాస్కర్‌లు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని హాలిగేర గ్రామంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్ ఆధ్వర్యంలో నాలుగు టీములుగా ఏర్పడి పూజ చేసి రీసర్వే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని రైతులు అధికారులకు సహకరించి రీసర్వే చేయించుకోవాలన్నారు. రీసర్వేను చేయించుకుంటే పొలం కొలతలు చేసి హద్దులను చూపించి ఆన్‌లైన్ రైతుల పేర్లు నమోదు చేస్తామన్నారు. అలాగే ఈ పాస్‌పుస్తకం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాయుడు, మాబు, కృష్ణ, మండల సర్వేయర్ శ్రీనివాసులు, విఆర్ఓలు రాజేశ్వరి, రామాంజనేయులు, గ్రామాల సర్వేయర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాలకు అత్యాధునిక వైద్య పరికరాలు అందజేత



**కొత్తపల్లె, జనవరి 20, ప్రభాతవార్త:** మండలంలోని గోకవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి భారతీయ స్టేట్ బ్యాంకు వారి సహకారంతో హైదరాబాద్ అవేర్ గ్రూప్స్ తమ వంతు సహకారంగా వైద్యశాలకు అత్యాధునిక వైద్యపరికరాలు సోమవారం అందజేశారు. వైద్యశాలకు అవసరమైన హైడ్రాలిక్ బెడ్ కాట్, స్ట్రక్చర్, ఆపరేషన్ టెబుల్, వాటర్ ప్యూరీఫైర్ వంటి తదితర వైద్య పరికరాలను అవేర్‌గ్రూప్స్ చైర్మన్ మాధవన్, ప్రాజెక్టు డైరెక్టర్ వరుణ్, వైద్యులు విజేంద్ర, జుబేదాలకు అందించారు. వైద్యశాలకు అత్యాధునిక వైద్యపరికరాలను ఎస్‌ఐబిఐ వారి సహకారంతో అందించడం అభినందనీయమని వైద్యులు కొనియాడారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బిసి రుణాల కోసం ధరఖాస్తు చేసుకోండి



**రుద్రవరం, జనవరి 20, ప్రభాతవార్త:** బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకునేందుకు బిసి అన్నివర్గాలకు చెందిన వారు ధరఖాస్తు చేసుకోవాలని ఎంపీడిఓ భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ బిసి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకం కింద బ్యాంక్ లింక్ స్కీం దా ్వరా రుణాల కొరకు లబ్దిదారులు ఓబిఎంఎంఎస్ యాప్‌లో అన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ధరకాస్తు చేసుకోవడానికి అర్హత 21 నుంచి 60 సంవత ్సరాలలోపు దారిద్ర్యరేఖకు దిగువన ఉండి తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. రుణాలు ఒకటి స్లాబ్‌కింద రూ.2 లక్షలు, రెండవ స్లాబ్ కింద రూ.3 లక్షలు, మూడవ స్లాబ్‌కింద రూ.5 లక్షలు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. లబ్దిదారులు అన్‌లైన్‌లో ధరఖాస్తుచేసుకోవాలని ఎంపీడిఓ తెలిపారు.

## రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం కోశాధికారి రుద్రారెడ్డి



**కర్నూలు హాస్పిటల్, జనవరి 20, ప్రభాతవార్త:** విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ సంఘం ఎన్నికల్లో హ్యాండ్‌బాల్ కర్నూలు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న డాక్టర్ రుద్రారెడ్డిని రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రుద్రారెడ్డి ఎన్నిక పట్ల జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు కెఇ జగదీష్‌కుమార్, శ్రీనివాసులు, ఈశ్వర్‌నాయుడు, అవినాష, శ్రీధర్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర భ్ంగా రుద్రారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్రసంఘం నాయకులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఆనందదాయకం అన్నారు. రాష్ట్రంలో హ్యాండ్‌బాల్ క్రీడతో పాటు క్రీడాకారుల సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తానన్నారు.

## బిజెపి రాజ్యాంగ వ్యతిరేక విధానాలతో రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి ప్రమాదం

**కర్నూలు విద్య, జనవరి 20, ప్రభాతవార్త:** బిజెపి రాజ్యాంగ వ్యతిరేక విధానాలతో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి, పౌరహక్కులకు ప్రమాదమని సిపిఐ (యంఎల్)లిబరేషన్ పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు వి శంకర్ అన్నారు. సోమవారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో సిపిఐ (యంఎల్)లిబరేషన్ ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల "రాజ్యాంగ పరిరక్షణ" సదస్సు జరిగింది. ఈసదస్సుకు ముఖ్యఅతిథిగా లిబరేషన్ పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్ వి శంకర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి బంగార్‌రావు పాల్గొన్నారు. సౌహార్థ అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్పలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఏమాత్రం భాగస్వామ్యం లేని ఆర్ఎస్ఎస్ సంస్థ అధినేత మోహన్ భగవత్ దేశ స్వాతంత్ర్యానికి కొత్తభాష్యం చెబుతున్నారని ఇటువంటి శక్తుల చేతుల్లో దేశం ఎక్కువ కాలం ఉంటే దేశం 100 సంవత ్సరాలు వెనక్కు వెళ్తుందని అటువంటి లక్ష్యంతోనే మోడీ, అమిత్‌షాల నేతృత్వంలో బిజెపి పాలన కొనసాగిస్తు రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నం చేస్తుందని చెప్పారు. ప్రజలు వారి ప్రయత్నాలను తిప్పికొటి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ రాష్ట్ర స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉదయ్‌కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమణయ్య, ఏ నాగరాజు, హెచ్ వేమన, పార్టీ కడప జిల్లా నాయకులు బి ఓబయ్య, చంద్రశేఖర్, అన్నమయ్య జిల్లా నాయకులు విశ్వనాధ్, చెన్నయ్య, అనంతపురం జిల్లా నాయకులు టిఎస్ వలి, జిల్లా నాయకులు నాగార్జున, మునిస్వామి తదితరులు ప్రసంగించారు.

## రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

**కొత్తపల్లె, జనవరి 20, ప్రభాతవార్త:** రీసర్వేతో భూ సమస్యలకు చెక్ పడుతుందని డిప్యూటి తహశీల్దార్ పెద్దన్న అన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వే ప్రాజెక్టులో భాగంగా సోమవారం ఫైలెట్ గ్రామంగా ఎన్నుకోబడిన మండల పరిధిలోని బట్టువారిపల్లెలో భూమి పూజలు చేసి రీ సర్వే ప్రారంభించారు. ఎన్నో సంవత ్సరాలుగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రీ సర్వే చేపడుతుందని రైతులు సహకరించాలని ఆయన కోరారు. ఈకార్య క్రమంలో మండల సర్వేయర్ అనుషా రాణి, గ్రామసర్వేలు శ్రీనివాసులు, రాజ్ కుమార్, వేణు, గ్రామ రెవిన్యూ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌ను స్వాధీనం చేయాలి

**:- ఎంపిడిఓ సూర్యనారాయణను కోరిన దళిత సంఘం నాయకులు**

**ఆలూరు, జనవరి 20, ప్రభాతవార్త:** ఆలూరు పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌ను దళిత సంఘాలకు స్వాధీనం చేయాలని దళిత సంఘం నాయకులు కొమ్ము రామాంజనేయులు, మసాల జగన్, గోవింద్‌లు కోరారు. సోమవారం ఆలూరు ఇంచార్జ్ ఎంపిడిఓ సూర్యనారాయణకు దళిత సంఘం నాయకులు వినతిపత్రం అందచేశారు. వీరితో పాటు మధు మాదిగ, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రదీప్, నాయకులు రవికుమార్‌లు పాల్గొన్నారు.

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణ కేంద్రానికి 18 సెంట్ల స్థలం విరాళం



**వెల్దుర్తి, జనవరి20, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు వెల్దుర్తి పట్టణానికి చెందిన వా ్యపారవేత్త వి.ప్రశాంత్‌కుమార్ 18 సెంట్ల (దాదాపు రూ. 40లక్షలవిలువ)స్థలాని ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ తన కుటుం బసభ్యుల తో కలసి బెంగుళూరు నగరంలోని అంతర్జాతీయ ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యాలయానికి చేరుకొని భారతదేశ ఆధ్యాత్మిక గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీ శ్రీ రవిశంకర్ గురూజీని మర్యాదపూర్వకంగా కలిసి తన జీవితంలో జరిగిన కొన్ని విషయాలను గురూజీకి వివరించారు. గురూజీని కుటుంబసభ్యులతో కలిసి శాలువతో సన్మానించారు. తన తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు వి.ఎస్.రామమూర్తి 20 ఏళ్ల కిందట క్యాన్సర్‌తో ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో బెంగుళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రంలో సుదర్శనక్రియ, మెడిటేషన్ కోర్సు సాధన చేయడంతో క్యాన్సర్‌ను జయించారు. దీంతో వెల్దుర్తిలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ శాశ్వత శిక్షణా కేంద్రం ఏర్పాటుకు వెల్దుర్తి జాతీయరహదారి ప్రక్కన తొగర్చేడు రహదారిలో తన స్థలాన్ని ఇచ్చేందుకు ప్రశాంత్‌కుమార్ ముందుకు వచ్చారు. ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటుతో చాలా మంది అనారోగ్యానికి గురైన రోగులకు, యువతకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ మంచి కార్యానికి పూనుకున్న ప్రశాంత్‌కుమార్, కుటుంబసభ్యులను రవిశంకర్ గురూజీ అభినందించారు. స్థలం కేటాయింపు అనంతరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణా కేంద్రాన్ని నిర్మాణం చేపట్టి శాశ్వతంగా ట్రైనీని ఏర్పాటుచేస్తామని గురూజీ తెలిపినట్లు వారు పేర్కొన్నారు. విరాళంగా అందిస్తున్న స్థలాన్ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి పరిశీలన చేస్తారన్నారు.

## ఆదోని కబడ్డీ క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపిక

ఆదోనిలీగల్, జనవరి10, ప్రభాతవార్త; ఈనెల 19వ తేదీన కర్నూలులోని స్టేడియంలో మహిళలు, పురుషుల 71వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా స్థాయి ఎంపిక నిర్వహించారు. పురుషులు 40 మంది క్రీడాకారులు పాల్గొనగా 12 మంది ఎంపికయ్యారు. మహిళా క్రీడాకారులు 20 మంది పాల్గొనగా 12 మంది క్రీడాకారులు ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల 71వ రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళలు, పురుషులు కబడ్డీ టోర్నమెంట్‌కు ఆదోని నుంచి ఎస్.అవినాష్, అరుణ్‌జ్యోతినగర్ కె.సుమంగళ, కస్తూర్బా స్కూల్ విద్యార్థిని బి.సంధ్య, ఎంపికయ్యిందన్నారు. వీరు ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా అనకాపల్లి మండలం అంకుపాలెంలో 71వ సీనియర్ పురుషుల మహిళల కబడ్డీ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. వీరిని ఎంపిక చేసినందుకు కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఆర్.శుభకర్‌కు, ఆదోని సీనియర్ కబడ్డీ ప్లేయర్స్ ఫిలిప్స్, కబడ్డీ టీం కెప్టెన్ కోచ్ అమర్‌ప్రకాష్‌లకు అభినందనలు తెలిపారు.

## ప్లంబర్‌లకు హెల్మెట్‌లు పంపిణీ

**వెల్దుర్తి, జనవరి20, ప్రభాతవార్త:** ప్లంబర్‌లకు రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ కల్పించే ఉద్దేశ్యంతో ఆశీర్వాద్ పైప్స్ కంపెనీ నిర్వాహకులు వెల్దుర్తి లలిత హార్డ్‌వేర్, ఆశీర్వాద్ పైప్స్ డీలర్ లోకేష్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ నిర్వాహకులు ప్లంబర్‌లతో సమావేశం అయ్యారు. వినియోగదారులకు నాణ్యమైన పైపులను తగు ధరలకే అందించడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాద నివారణలో భాగంగా వెల్దుర్తి ఎస్సై, పోలీస్‌సిబ్బంది అవగాహన కల్పించి సహకారం అందించారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశీర్వాద్ కంపెనీ నిర్వాహకులు శంకర్, బాలాజి, లక్ష్మీనర్సయ్య, కౌశిక్‌రెడ్డి, వెల్దుర్తి లలిత హార్డ్‌వేర్, ఆశీర్వాద్ పైప్స్‌డీలర్ లోకేష్, ప్లంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ తాగునీటి కనెక్షన్లు తొలగించండి

**ఆదోని, జనవరి 19, ప్రభాతవార్త:** ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ సంవత్సరాల తరబడి నాగనాథనహళ్లిలో రూ.14కోట్లతో నిర్మించిన ఆస్పరి వాటర్ స్కీంకు ఉన్న అక్రమ కనెక్షన్లు తొలగించాలని ఆస్పరి సర్పంచ్ మూలింటి రాధమ్మ, చిగలి సర్పంచ్ రాధాకృష్ణ, జిల్లా కెడిసిసి బ్యాంక్ మాజీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, అఖిలపక్ష పార్టీల నాయకులు విరుపాక్షి, బాలకృష్ణ, రంగస్వామి, రామాంజనేయులు, మేకల రంగనాథ్ యాదవ్, మూలింటి చంద్ర శేఖర్‌లు సబ్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సబ్ కలెక్టర్ మౌర్యద్వాజ్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పరి మండల ప్రజలు పాల్గొన్నారు.

